## ఈవారం కథ

ఆకాశం దట్టంగా మబ్బులుపట్టివుంది. అప్పుడప్పుడు గాలితెరలు రివ్వున లేచి నేలపైని దుమ్మని మనుషులపై ఏదో ప్రతీకారం తీర్చుకుంటున్నట్టుగా క్రుమ్మరిస్తున్నాయి! కరెంటు స్తంభాలకు వ్రేలాడుతున్న బల్బులు లోవోల్టేజికి గురుతుగా మిణుకు, మిణుకుమంటున్నాయి ఆకాశంలో నక్షత్రాలవలె! సాయంత్రం నాల్గుగంటలకి రావాల్సిన బస్సు ఏడుగంటలయినా రాకపోవడంతో బస్సుకోసంఎదురు

చూస్తున్న స్కూల్ టీచర్ అరుణ, హెడ్మాస్టర్ పరంధామయ్యలలో అసహనం చోటు చేసుకుంటోంది. అలా బిక్కుబిక్కుమంటూ...

ఇంకో అరగంట కూర్చున్నాక దుమ్మని లేవుకుంటూ రయ్యిమని వచ్చి ఆగింది ఎర్రబస్సు. ఇంకేమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఆ బస్సులో దూరిపోయారు హెడ్మాస్టరు, స్కూల్ టీచర్ అరుణ. ఎదురుగా ఖాళీగా వున్న సీట్లో కూర్చుండిపోయింది అరుణ. పరంధామయ్య కూడా ఇంకొక సీట్లో అడ్జస్ట్ అయిపోయాడు. అరుణ ప్రక్కసీటు ఒకటి ఖాళీ పోనూ బస్సంతా నిండుగా వుంది. ఇంకొక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి వీరివెనకాలే కదిలే బస్సుని ఎక్కడం చూసింది అరుణ. అంతవరకూ

బస్టాపులో కనిపించని ఆ వ్యక్తి ఎవరా అని చూసింది అరుణ. ఆ ఊరి వ్యక్తిలా లేడని గ్రహించింది. రోజూ అదే బస్సులో ప్రయాణం కాబట్టి చాలామంది ఆ ఊరివారిని గుర్తించగలదు అరుణ. అరుణ ప్రక్కసీటు ఖాళీగా వున్నా అతను చూసి మామూలుగా నిల్చునివున్నాడు. చెదరిన జుట్టు, మాసినగడ్డం, నలిగిపోయిన బట్టలు, ముఖంలో గంభీరత కనిపిస్తుంది. అరుణ దగ్గర న్యూస్‌పేపర్ అడిగి చదువుతూ తరచూ బస్సులో నుంచి బయటకు చూస్తున్నాడు ఆ వ్యక్తి. అతని ముఖంలో ఏదో ఆందోళన పసిగట్టింది అరుణ. ఇంతలో ఏదో స్టాపులో బస్సు ఆగింది. ముగ్గురు దృఢంగా వున్న వ్యక్తులు ఎక్కడంచూసి అరుణ ప్రక్కసీట్లో సడెన్‌గా కూర్చున్నాడు ఆ వ్యక్తి. అరుణకు అరికాలిమంట నెత్తికెక్కింది. జులాయివెధవ ఎంత ధైర్యంగా ప్రక్కనే కూర్చున్నాడు అనుకుంది. మరీ ఏమాత్రం అతనికి తగలకుండా దూరంగా జరిగి కూర్చుంది తనలోతానే తిట్టుకుంటూ. క్రొత్తగా ఎక్కిన వారిని ఏమాత్రం చూడకుండా న్యూస్ పేపర్ చూడడంలో నిమగ్నమయ్యాడు ఆ వ్యక్తి. అరుణ ఆ ముగ్గురికేసే చూసింది. ముగ్గురూ నల్లగా, దృఢంగా పందికొక్కుల్లా వున్నారు. ఒకడికి బుర్రమీసాలు. అందులో ఒకడు అరుణ ప్రక్కసీట్లో వ్యక్తిని చూసి ఏదో చెవుతున్నాడు గుసగుసగా మిగతా ఇద్దరికీ. ఇంతలో ఇంకొక స్టేజీవద్ద బస్సు ఆగింది. అంతవరకూ న్యూస్‌పేపర్ చదువుతున్న పక్కసీట్లో వ్యక్తి దిగిపోయాడు. స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంది అరుణ. అయితే ఆ వెంటనే అంతవరకు తాపీగా నిల్చున్న ఆ ముగ్గురు వ్యక్తులు ఎవరో తరిమినట్లు వెంటవెంటనే దిగిపోయారు ఆ



# పర్యవసానం

## నక్షత్రం వేణుగోపాల్

వ్యక్తిని అనుసరిస్తూ. అరుణ ఇదంతా గమనిస్తూనే వుంది. ఆమెకు విచిత్రంగా తోచింది. ఆ వ్యక్తులు అంతవరకూ తాపీగా నిల్చుని ఇతడు దిగగానే ఎందుకు దిగారు? ఈ వ్యక్తి అంతవరకూ బయటకు చూస్తున్నవాడు వాళ్ళు ఎక్కగానే ముఖం చాటెందుకు చేసుకున్నట్లు? వాళ్ళకు ఇతనికి ఏదో సంబంధమున్నట్లుంది. అది ఏమయ్యుంటుందబ్బా అని ఆలోచిస్తూ బుర్రగోక్కుంది అరుణ. ఏదైతేనేమిలే అని తన ప్రక్కన శనిగ్రహం దిగిపోయిందని సంతోషించింది. "ఎన్నిరోజులయిందో స్నానంచేయక ఒకటే కంపువాసన" అనుకుంది అరుణ. తను దిగాల్సిన స్టాపులో బస్సు ఆగగానే దిగి ఇంటికెళ్ళింది అరుణ.

ఫ్రెష్‌గా స్నానంచేసి ఈజీచైర్‌లో కూర్చుంది అరుణ. ప్రక్కనే వేసిన న్యూస్‌పేపర్ పైన బ్లూ ఇంకుతో వ్రాసిన అక్షరాలు ఆమె కళ్ళను తాకాయి. పేపరు దగ్గరకు తీసుకుని చదివింది "నేను ప్రమాదంలో వున్నాను. దయచేసి 892678కి ఫోను చేయండి?" మరోసారి చదివింది.

"ఈ అక్షరాలు నా పేపరుపైకి ఎలా వచ్చాయబ్బా" అని ఆలోచిస్తూ కూర్చుంది. ఒకసారి ఆమె మనస్సు బస్సు ప్రయాణం చుట్టూ తిరిగింది. తన ప్రక్కసీట్లో కూర్చున్న అపరిచితవ్యక్తే ఇది వ్రాసుంటాడనుకుంది. ఆ వ్యక్తి ఒక్కసారి పెన్ను చేతిలో పట్టుకొని అటూఇటూ చూడటం గమనించినట్టు గుర్తుకొచ్చింది. ఈ వాక్యం అతనే రాసుంటాడని నిర్ధారించుకుంది అరుణ.

"ముఖం చూస్తేనే తెలుస్తోంది జులాయి వెధవని. ప్రమాదంలో ఉండకుంటే ఇంకేం చేస్తాడు, ఇంకా ఫోన్ చేయాలట" చిరాకు కలిగింది అరుణకి. బస్సు ఆలస్యం, దుమ్ము ధూళి ప్రయాణం, అంతా చికాకుగా అనిపించింది. ఇంకా ఈ గాలికిపోయే గొడవలు తనెందుకు తగిలించుకోవాలనుకుని హాయిగా నిద్రపోయింది.

* * *

గడియారంలో ఉదయం ఆరుఅయ్యిందని అలారం గయ్యిమంది. లేచి అలారం గొంతునొక్కి బ్రతుకు పోరాటానికి సిద్ధమౌతూంది అరుణ. దిన పత్రిక హెడ్డింగులు చూడడం అలవాటు రోజూ ఉదయం. న్యూస్‌పేపర్ విప్పగానే ఆమెకళ్ళు ఒక దగ్గర టక్కున ఆగిపోయాయి. తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. మరోసారి చదివింది. మార్పేమీలేదు. ఎంత కాదనుకున్నా అవే అక్షరాలు, కొన్ని గంటలక్రితం తన ప్రక్కనే కూర్చున్న వ్యక్తి, శవంగా మారటం ఆమె శరీరంలో సన్నని వణుకుని పుట్టించింది.

"అజ్ఞాత తీవ్రవాది ఎదురుకాల్పుల్లో హతం" అనే వార్తక్రింద ఆ వ్యక్తి ముఖం సరిగ్గా కనిపించకపోయినా, ఆ వ్యక్తి ఆకారాన్ని తనింకా మరువనేలేదు. అప్పుడుగానీ తన మనస్సులో అంతర్మథనం మొదలుకాలేదు. "బస్సులో మామూలుగా ప్రయాణిస్తున్న అతని దగ్గర ఏ ఆయుధమున్నట్టూ కన్పించలేదే! ఫొటోలో వున్న ఆయుధమైతే ఏ చొక్కాలోనో, జేబులోనో దాచుకునేదిగాలేదే? ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు? నిజమైన తీవ్రవాదేనా? అయినంత మాత్రాన ఎందుకు చంపవలసివచ్చింది? అరెస్టుచేసి కోర్టుకి సరెండర్ చెయ్యొచ్చుకదా!" ఇలా ఆలోచిస్తూ వుంటే నిన్నటి పత్రికపై అతడు రాసిన అక్షరాలు కనిపిస్తున్నాయ్– అప్రయత్నంగా ఆ అక్షరాలు చదివింది. అతను ముందుగానే ప్రమాదాన్ని పసిగట్టాడని అప్పుడప్పుడే అర్థమవుతూంది అరుణకి. అప్రయత్నంగా ఇంకేమీ ఊహించేస్థితిలో లేకుండా అతను వ్రాసిన ఆ నెంబర్‌కి ఫోన్ చేసింది. అవతల ఫోను ఎత్తి 'హలో...హలో' అంటూంటే ఏం మాట్లాడాలో తోచడంలేదు అరుణకి. మాటలు గొంతుదాటి రాలేకపోయాయి.

"హలో, హలో" అవతల వ్యక్తి అంటూనే వున్నాడు.

"హలో సర్ నిన్న సాయంత్రం మీదగ్గరికి ఎవరన్నా రావల్సివుండేనా" కంగారులో అనేసింది అరుణ.

"చూడండి! మీరే కంగారులో వున్నట్టున్నారు. నేను లాయర్ రామారావ్‌ని మాట్లాడుతున్నాను. ప్రతిరోజూ ఎందరో నన్ను కల్సుకుంటారు. నిన్న సాయంత్రం ఎవరు రావల్సిందో నేను మీకు ఎలా చెప్పగలను? మీరెవరో విషయమేంటో చెబితే ఆ తర్వాత చూడొచ్చు."

అప్పుడు గొంతు సవరించుకొని చెప్పసాగింది అరుణ.

"నేను బొండపల్లి స్కూల్‌టీచర్ అరుణని. నిన్న సాయంత్రం ఏడుగంటలకి బొండపల్లి వద్ద ఎక్కిన ఒక ప్రయాణీకుడు చీపురుపల్లివద్ద దిగగానే అతన్ని అనుసరిస్తూ ముగ్గురు దృఢకాయులు దిగారు. అతను నా పేపర్‌పై మీ నంబర్‌వ్రాసి దిగాడు. అయితే ఈ రోజు పేపర్‌లో ఎన్‌కౌంటర్‌లో హతుడు అతన్ని పోలివున్నాడు. అతనెవరు? మీకేమైనా విషయం తెలిస్తే"....

"ఏంచెప్పమంటారండీ! ఏదో అత్యవసర సమావేశానికి బయలుదేరిన రవికిషోర్‌ని పోలీసులు పొట్టన పెట్టుకున్నారని యిప్పుడే ఫోను వచ్చిందండీ! పైగా గుర్తుతెలియని తీవ్రవాదిఅంటూ బుకాయిస్తున్నారుకూడా!" జీరపోయిన గొంతుతో బాధ, కోపం కలగలిపి పలికాడు రామారావు.

"ఏమిటీ అతను రవికిశోరా?" నమ్మలేకపోయింది అరుణ. పేరు వినడమేకానీ అతనెవరో ఎప్పుడూ చూడలేదు... చేతిలో ఫోను ఎప్పుడో జారిపోయింది నేలపైకి. రవికిశోర్ పేరువినగానే పెళ్ళున దుఃఖం వచ్చింది అరుణకి. "నిన్న సాయంత్రం నా ప్రక్కన కూర్చున్న వ్యక్తి రవికిశోరా? అయ్యో నేనెంత దుర్మార్గురాలిని, అతన్ని ఎంత నీచంగా అంచనా వేశాను" అని తనలోతానే మథనపడి వ్యక్తిరూపాన్ని బట్టి గుణాన్ని అంచనా వేసినందుకు తన మూర్ఖత్వానికి సిగ్గుపడింది. "పదిమందికి మానవత్వం గూర్చి చెప్పే నేనే నిన్న అలా ప్రవర్తించానే" అని తనలోతానే కుమిలిపోయింది అరుణ.

తన ఆలోచనలన్నీ రవికిశోర్ ప్రజలకోసం చేసిన అనేకానేక సేవలను తలపోస్తూ సుళ్ళు తిరుగుతున్నాయ్!

'బోనాలగూడెం ప్రజలు పోరుచేసి సాధించుకున్న 'భూమిపోరు' వెనుక రవికిశోర్ తెగువ, ధాన్యం గిట్టుబాటుధరలు సాధించుకోవడంలో రవికిశోర్ పోరాటపటిమ, మార్కెట్ యార్డుల్లో గుండాల, దళారీల ఆటకట్టు వెనుక రవికిశోర్ సాహసం...

**న్యూస్‌పేపర్ విప్పగానే ఆమె కళ్ళు ఒకచోట టక్కున ఆగిపోయాయి. తన కళ్ళను తానే నమ్మలేక పోయింది. మరోసారి చదివింది. కొన్ని గంటల క్రితం తన ప్రక్కనే కూర్చున్న వ్యక్తి శవంగా మారటం ఆమె శరీరంలో వణుకు పుట్టించింది.**

18-8-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

"నిన్న సాయంత్రం నా పక్కన కూర్చున్న వ్యక్తి రవికిశోరా! అయ్యో, ఎంత దుర్మార్గురాలిని! అతన్ని ఎంత నీచంగా అంచనా వేశాను" అని తనలో తాను మథన పడింది. ఆలోచనలన్నీ రవికిశోర్ ప్రజలకోసం చేసిన అనేకానేక పనులను తలపోస్తూ సుళ్ళు తిరుగుతున్నాయ్. ఎన్నో మంచి పనులు చేసిన రవికిశోర్ ఏం ద్రోహం చేశాడని ఇంతటి శిక్ష? ఎందుకీపని చేయవలసి వచ్చింది పోలీసులకి?

ఇలా ఎన్నో ఎన్నో మంచిపనులు ప్రజలకోసం చేసిన రవికిశోర్ ఏం ద్రోహం చేసాడని ఇప్పడింతటి శిక్ష! ఎందుకీపని చేయాల్సివచ్చింది పోలీసులకి?

వేలమంది ప్రజల నాలుకపై నిల్చిన రవికిశోర్ ఈరోజు ఇలా దిక్కులేని చావుకు గురయ్యాడంటే ఎంత ఘోరం, ఎంత దారుణం, జరిగిన అన్యాయాన్ని తలచుకుంటూ బాధపడింది అరుణ.

కళ్ళముందు జరిగిన అన్యాయాన్ని తలచుకొని ఊరుకోలేక, జరిగిన అన్యాయాన్ని ఎదిరించనూ లేక కొట్టుమిట్టాడుతూ...సతమతమౌతూ అరుణ తలపట్టుకుని కుర్చీలో జారగిలపడింది.

ఒక బాధ్యతగల పౌరురాలిగా, పదిమందికి నీతిని బోధించే ఉపాధ్యాయురాలిగా జరిగిన అన్యాయాన్ని ఎలా ఎదిరించాలా అని ఆలోచిస్తూ– లాయర్ రామారావుకి ఫోన్‌చేసింది అరుణ. "సార్ నేను అరుణని మాట్లాడుతున్నాను. ఇప్పడీ కేసు విషయమై ఏమి ఆలోచించారు సార్" అంది అరుణ.

"ఆ! మీతోటే మాట్లాడాలనుకుంటున్నా! జరిగిన సంఘటన గురించీ, అన్యాయాన్ని గురించీ పత్రికల వారికీ, కోర్టులోనూ చెప్పగలరా?" అన్నాడు లాయర్ రామారావు.

"కోర్టులోనేకాదు సార్, ఇంకా ఎక్కడైనా చెప్పగలను" ధైర్యంగా కొంచెం ఆవేశంగా అంది అరుణ.

"చాలా కృతజ్ఞతలమ్మా! సాక్ష్యం చెప్పేవారు లేక కేసును ఇంతవరకూ ఫైల్ చేయలేదు. ఈ రోజు సాయంత్రం నాలుగుగంటలకి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేస్తాను. మీరు చూసిందంతా పూసగుచ్చినట్లు చెప్పాలి" అన్నాడు లాయర్.

"సరేనండి నేను సాయంత్రం నాల్గుగంటలకల్లా వస్తాను" అని ఫోన్ పెట్టేసి యధావిధిగా స్కూల్‌కి వెళ్ళిపోయింది.

లాయర్‌గారు విలేకరుల సమావేశానికి పత్రికల వారికి ఆహ్వానాలు టైప్‌చేసి పంపించారు.

అనుకున్నట్టుగానే సరిగ్గా నాల్గుగంటలకి అరుణ ప్రెస్‌కి వచ్చి విలేకరులందరికీ జరిగింది జరిగినట్టుగా వివరించింది. విలేకరులడిగిన ప్రశ్నలన్నింటికీ ఓపిగ్గా సమాధానం ఇచ్చింది. ఆమె చెప్పిన వివరాలన్నీ మిస్ కాకుండా నోట్‌చేసుకున్నారు విలేకరులు. అప్పటికి తన గుండె బరువు కొద్దిగా తగ్గినట్టె తృప్తిగా శ్వాసపీల్చుకుని ఇంటికి వెళ్ళింది అరుణ.

* * *

"టక్...టక్...టక్..." మని తలుపుపై శబ్దం చేస్తుంటే నిద్రలోంచి మేల్కొంది అరుణ. 'ఇంకా ఆరుకాలేదు ఇంతపొద్దున వచ్చింది ఎవరబ్బా' అనుకుంది అరుణ. ఇంకా సరిపోని నిద్రతో కళ్ళు నలుపుకుంటూ మెల్లగా లేచింది.

కళ్ళు నలుపుకుంటూనే చూసింది, వచ్చింది ఎవరైందీ! గుండె గుభేల్‌మంది అరుణకి. తనవైపే వస్తున్న ఆ ఆకారాలు, తలపై కొమ్ములు, నోట్లో కోరలు తక్కువగా వున్న యమకింకరుల్లా...నిన్న బస్సులో చూసిన అవే రూపాలు...

అవే బుర్రమీసాల ఆకారాలు. చేతిలో లాఠీ, తెల్ల షర్టు, ఖాకీప్యాంటు, రాయినిసైతం బద్దలుచేసే ఇనుపబూట్లశబ్దం క్రమంగా తనదగ్గరికి. ఇంకా దగ్గరికి వస్తూంది.

వారికి ఏమికావాలో, ఎందుకొస్తున్నారో అర్థంకాలేదు అరుణకి. తన సందేహంకు సమాధానం రాబట్టే దిశలో అడగబోయింది అరుణ.

ఆమెకా అవకాశం లేకుండా "ఎన్నిరోజులుగా నడుపుతున్నవే ఈ వ్యవహారం? ఖడిలో పాఠాలు చెప్పమంటే, పోరాటం చెయ్యమని చెప్తావా? చెప్ప.. ఆ రవికిశోర్‌గాడితో ఎన్నేళ్ళుగా పార్టీలో పని చేస్తున్నావ్?"...అంటూ ప్రశ్నలవర్షంతో ఒకడికంఠం కర్ణకఠోరంగా బూతులు పలుకుతూంది. ఇంకొకడి లాఠీ అరుణ వీపుపై చర్రుమంది. కెవ్వుమని అరిచింది అరుణ. అరుణ జుట్టు, మిగిలిన ఇద్దరి దూలాల్లాంటి చేతుల్లో! అరుణ రెండుభుజాలు విరిచిపట్టి కర్కశంగా లాగుతూ ఇంకా ఏదేదో అరుస్తూనే వున్నారు.

"సాక్ష్యం చెప్తావ్ సాక్ష్యం. ఇప్పడు చెప్ప సాక్ష్యం... ఎవరికి చెప్పకుంటావో చెప్పకో నీయమ్మదొంగలం..."బూతుల మూటలు విప్పాడొకడు.

అప్పటికిగానీ తనవెందుకు ఇలాచేస్తున్నారో అర్థంకాలేదు అరుణకి. తన గొంతులోనుంచి ఇంకేమాట రావట్లేదు. ఆలోచనలు మాత్రం పదునెక్కుతున్నాయి. ఇప్పడిప్పడే అసలు ప్రజాస్వామిక ప్రభుత్వ స్వరూపం అర్థమవుతోంది అరుణకి.

నిన్ననే ఒక ప్రాణం తీసామనే గర్వంతో మరింత క్రూరంగా అరుణ శరీరాన్ని లాక్కుపోతున్నాడు ఒకడు. అలా నేలపై రాసుకుంటూ...గీసుకుంటూ రక్తం చిందుతున్న అరుణ ఒక మూటగా జీపులో విసిరివేయబడింది.

నేలపై రాపిడికి గుర్తుగా రక్తం...పోలీసుల కిరాతకానికి గుర్తుగా ఎర్రటిరక్తం... అరుణ శరీరం నుంచి నేలపైకి...ధారగా...

అలా జీపు చక్రాలు గిర్రున తిరుగుతూ వెళ్తుంటే ఆ జీపు వెంటే రక్తం...నియంతృత్వ ప్రజాస్వామ్య స్వరూపానికి సాక్షిగా!

## అందరికీ వాళ్లే!

కపూర్స్ కుటుంబాలకు చెందిన రిషికపూర్, అనిల్‌కపూర్, సంజయ్‌కపూర్‌లు మొదటిసారిగా నటించిన సినిమాలకు సంగీత దర్శకులు ఒక్కరే కావడం విశేషం! వారే లక్ష్మీకాంత్ – ప్యారెలాల్‌లు. రిషికపూర్ మొదటి చిత్రం "బాబీ", అనిల్‌కపూర్ మొదటి చిత్రం "ఒసాత్ దిన్", సంజయ్‌కపూర్ మొదటి చిత్రం "ప్రేమ్"లు వీరి మ్యూజిక్ డైరెక్షన్‌లో రూపొందినవే!

– బాషా

## సుభాషితాలు

"ఆలోచనయే కాలం, అది అనుభవానికీ, జ్ఞానానికీ, గతానికీ సంబంధించినది. కాలం మానవుని మానసిక శత్రువు. మన చర్య జ్ఞానం మీద ఆధారపడింది అంటే కాలం మీద ఆధారపడింది. కాన మానవుడు గతానికి బానిస. ఆలోచనెప్పుడూ పరిమితమే. అందుకే మనమెప్పుడూ ఘర్షణలో వివాదంలో జీవిస్తుంటాము"

"కోర్కె, సౌఖ్యం, ఉల్లాసం మొదలగు ప్రేమ రహితమైన వాటిని పూర్తిగా వద్దను కాదంటామో అపుడు ప్రేమ పుట్టుకొస్తుంది. అది కరుణతోనూ, తెలివితోనూ కూడి వుంటుంది."

– జిడ్డు కృష్ణమూర్తి

సేకరణ: పి.సి. రావు